సాక్షి అనంతపురం

ఆదివారం । 1 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



జిల్లా పరిషత్‌లో బదిలీల జాతర

అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ జాతరను తలపించింది.

8లో

గరిష్టం/కనిష్టం

37.9°/23.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృత మైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం



అనంతపురం ఎడ్యుకేషన్: వేసవి సెలవుల అనంతరం జూనియర్ కళాశాలలు ఈనెల 2 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం పూర్తయి రెండో సంవత్సరంలోకి వెళ్లిన విద్యార్థులకు ఏప్రిల్‌లో 23 రోజుల పాటు తరగతులు నిర్వహించినా అంతంత మాత్రంగానే స్పందన లభించింది. చాలా కళాశాలల్లో పదుల సంఖ్యలో కూడా విద్యార్థులు హాజరు కాలేదు. జిల్లాలో 23 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ కళాశాలలున్నాయి. 2వ తేదీ నుంచి మొదటి సంవత్సరం అడ్మిషన్లు కూడా చేపట్టనున్నారు. ఓవైపు అడ్మిషన్లు, మరోవైపు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు. అదేరోజు నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నారు. హాస్టళ్లు కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు ఆయా కళాశాలలకు చేర్చామని ఆర్ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. తొలి రోజే పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సంవత్సరం నుంచి ఎంసెట్‌లో ప్రత్యేక తరగ తులు నిర్వహిస్తామన్నారు. అందుకు అవసరమైన మెటీరియల్ కూడా అన్ని కళాశాలల విద్యార్థులకు అందజేస్తామన్నారు.

కళాశాలల నిర్వహణ వేళల మార్పు..

ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు సంబంధించి నిర్వహణ వేళల్లో మార్పు చేశారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బదులుగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయి. గతేడాది నవంబరు నుంచి ఈ వేళలు అమలవుతున్నట్లు ఆర్ఐఓ తెలిపారు. అందరూ నిర్ణీత సమయంలోగా కళాశాలలకు వెళ్లాలని సూచించారు.

ముంగారుకు వేళాయె..

- నేటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- 4.38 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా
- ఇంకా మొదలుకాని రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ
- ప్రభుత్వ సాయమూ కరువై అన్నదాతల ఆవేదన




అనంతపురం అగ్రికల్చర్: ముంగారు (ఖరీఫ్-2025) ఆదివారం నుంచి మొదలుకానుంది. జిల్లాకు సంబంధించి ముఖ్యమైన వ్యవసాయ సీజన్ ఇది. నైరుతి రుతుపవనాలు గత నెల 26నే జిల్లాలోకి ప్రవేశించడంతో తొలకర్లు ముందస్తుగానే పలకరిస్తున్నాయి. వేరుశనగతో పాటు ప్రధాన పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు సరైన సమయమని ఏఆర్ఎస్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.విజయశంకర బాబు, డాక్టర్ సాధినేని మల్లీశ్వరి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ క్రమంలో ఆశల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నా పాలకుల తోడు లేకపోవడం శాపంగా మారింది.

4.38 లక్షల హెక్టార్లు అంచనా..

ఈ ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు 4.38 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేశారు. అందులో వర్షాధారంగా 3,06,450 హెక్టార్లు కాగా నీటి వసతి కింద 1,32,321 హెక్టార్లుగా లెక్క వేశారు. సకాలంలో పంటలు సాగులోకి రావాలంటే జూలైలో మంచి వర్షాలు పడాలి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలల కాలాన్ని ఖరీఫ్‌గా పరిగణిస్తారు. ఈ నాలుగు నెలల కాలంలో 319.6 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాలి.

4.03 లక్షల మంది రైతులు..

జిల్లాలో 4,03,454 మంది రైతులు ఉన్నారు. అందులో ఒక హెక్టారు లోపు భూమి ఉన్న చిన్నకారు రైతులు 1,27,584 మంది ఉండగా.. ఒకటి నుంచి 2 హెక్టార్ల లోపున్న సన్నకారు రైతులు 1,47,044 మంది, రెండు నుంచి నాలుగు హెక్టార్ల లోపున్న మధ్యస్థ రైతులు 1,03,793 మంది, 4 నుంచి 10 హెక్టార్ల వరకు ఉన్న ఓ మాదిరి రైతులు 22,952, 10 హెక్టార్లు, అంతకన్నా ఎక్కువ కలిగిన పెద్ద రైతులు 2,081 మంది ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



వేరుశనగ పంట (ఫైల్)

సాయం లేక అవస్థలు..

చంద్రబాబు ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుండటంతో ఏడాదిగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారి కూడా జిల్లాకు కేవలం 54 వేల క్వింటాళ్ల రాయితీ విత్తనం కేటాయించడంతో విత్తన కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. వేరుశనగతో పాటు పాతతరం ఎల్ఆర్‌జీ రకం కందులు ఇస్తున్నారు. కంది, మొక్కజొన్న, ఆముదం పంటల విస్తీర్ణం బాగా పెరిగే అవకాశం ఉన్నందున హైబ్రీడ్ విత్తన రకాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లుగా సరైన పంట దిగుబడులు లేక రైతుల ఆర్థిక పరిస్థితి దిగజారింది. ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' అమలు చేయకపోవడం, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ కింద పరిహారం కూడా ఇవ్వకుండా ఏడాదిగా దాటవేత ధోరణి అవలంబిస్తుండంతో విత్తనం, ఎరువులు, దుక్కులు, విత్తనం విత్తుకునేందుకు కూడా రైతులు ఇబ్బంది పడే పరిస్థితులు నెలకొన్నాయి.

2025 ఖరీఫ్‌లో పంటల వారీగా సాధారణ సాగు విస్తీర్ణం ఇలా

పంట	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
వేరుశనగ	1,82,004
వరి	19,466
కంది	55,296
పత్తి	44,001
ఆముదం	16,293
మొక్కజొన్న	14,653
జొన్న	1,719
సజ్జ	2,054
రాగి	69
కొర్ర	3,311
ఉలవ	1,071
పెసర	455
అలసంద	149
మినుము	312
సోయాబీన్	617
పొద్దుతిరుగుడు	1,642
అనుములు	28

సెటిల్‌మెంట్ల స్టేషన్!

- 'ప్రవాస భారతీయుడికి మోసం' కేసులో వెలుగులోకి కొత్త అంశాలు
- తవ్వేకొద్దీ బయటికొస్తున్న పుట్టపర్తి పోలీసుల అక్రమాలు
- పోలీస్ స్టేషన్‌లోనే ఆస్తుల అగ్రిమెంట్లు
- ఓ పోలీసు ఉన్నతాధికారి సమక్షంలోనే అన్యాయపు తంతు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సాధారణంగా పోలీసులంటే అరెస్టు చేయడం, లాకప్‌లో వేయడం చూస్తుంటాం. కానీ పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయం ఆస్తుల పంపకాలు, అగ్రిమెంట్లు రాసుకోవడానికి కూడా వేదికగా మారినట్లు తెలిసింది. చాలాచోట్ల సివిల్ తగాదాల్లో తాము తలదూర్చబోమని పోలీసులు చెబుతుంటారు. కానీ ఇక్కడి ఖాకీలు మాత్రం 'మేం సివిల్ పంచాయితీలే చేస్తా'మంటూ ముందుకెళుతున్నట్లు సమాచారం. అది కూడా ఓ పోలీసు ఉన్నతాధికారి సమక్షంలోనే అన్నీ జరుగుతున్నాయంటే స్టేషన్‌లో జరిగే అక్రమాల తంతును అంచనా వేయొచ్చు.

వారం రోజులు చిత్రహింసలు..

ప్రవాస భారతీయుడిని మోసం చేసిన కేసులో పుట్టపర్తి పోలీసుల అవినీతి అక్రమాలు తవ్వేకొద్దీ బయటికొస్తున్నాయి. ఏదైనా కేసులో నిందితుడు పోలీసులకు దొరికాడంటే అరెస్టు చేస్తారు.. ఆ తర్వాత కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు పంపడం పరిపాటి. కానీ ఈ కేసులో నిందితుడు సత్యనారాయణ రాజును పోలీసులు తమ ఆధీనంలో ఉంచుకుని వారం రోజుల పాటు చిత్రహింసలు పెట్టినట్లు తెలుస్తోంది. పోలీసుల ఆధీనంలో ఉండగానే బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. సత్యనారాయణ రాజు పేరుపై ఉన్న ఆస్తులకు ఏకంగా అనామతు అగ్రిమెంట్లు కూడా చేశారు. అంటే సత్యనారాయణ రాజుకు పూర్తిగా డబ్బు ముట్టిందని, దీనిపై సర్వ హక్కులు తనకే అనేలా నాన్‌జ్యుడీషియరీ స్టాంపు పేపర్లపై అగ్రిమెంట్లు జరిగాయి. అయితే, ఎవరికి రాయించారో (కొనుగోలు చేసిన వారి వివరాలు) పేర్లు వెల్లడించలేదు. ఈ క్రమంలో పుట్టపర్తి పోలీసులపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఇవన్నీ డివిజన్ స్థాయి పోలీసు ఉన్నతాధికారి సమక్షంలోనే జరిగినట్టు తెలుస్తోంది.

మీడియా ముందుకూ తేలేదు..

ప్రవాస భారతీయుడైన మహేంద్రకర్ ఆర్విన్‌ను రూ.12 కోట్లకు పైగా మోసం చేసిన సత్యనారాయణ రాజుపై మే 22వ తేదీ ఎఫ్ఐఆర్ నమోదైతే మే 28వ తేదీ అరెస్టు చేసినట్టు డీఎస్పీ వెల్లడించారు. అంటే వారం రోజుల పాటు అతణ్ని స్టేషన్‌లోనే ఉంచి చిత్రహింసలు పెట్టడంతో పాటు ఆస్తుల బదలాయింపు, ఆస్తులపై సేల్ అగ్రిమెంట్లు చేసినట్లు తెలుస్తోంది. ఏదైనా చిన్న కేసులోని నిందితుణ్ని పట్టుకుంటేనే మీడియా ముందు హాజరుపరిచి అద్భుతం చేశామని చెప్పుకునే పోలీసులు.. మే 28న డీఎస్పీ విజయ కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించే సమయంలో నిందితుడిని చూపకపోవడం గమనార్హం. ఇటీవల 'తెనాలి'లో జరిగిన తరహాలోనే ఇక్కడ కూడా నిందితుడికి చిత్రహింసలు పెట్టడంతో మీడియాకు చూపలేదని కొంతమంది పోలీసులే 'సాక్షి'కి తెలిపారు. తర్వాత ఒకరిద్దరు మీడియా ప్రతినిధులకు నిందితుణ్ని ముసుగేసి చూపించి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో టీడీపీకి చెందిన అన్నదమ్ములు కీలక పాత్ర పోషించడమే కాకుండా పోలీసులకు రూ.50 లక్షలు ముట్టజెప్పినట్టు తెలిసింది. ఈ క్రమంలో పోలీసుల తీరుపై సామాన్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖాకీలు ఇంత దారుణంగా వ్యవహరిస్తారా అన్న చర్చ జరుగుతోంది.

రేపు గుత్తిలో పరిష్కార వేదిక

అనంతపురం అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 2వ తేదీ సోమవారం గుత్తి పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ శనివారం తెలిపారు. గుత్తిలో పత్తికొండ రోడ్డులోని వసుధ ఫంక్షన్ హాలులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

ప్రకటనతో సరిపెడితే సరిపోదు..

'పరిష్కార వేదిక' కార్యక్రమం గుత్తిలో జరుగుతున్నట్లుగా కేవలం ప్రకటన ఇవ్వడంతో సరిపెడితే ప్రయోజనం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేదిక మార్పు విషయం గ్రామాల్లోకి తీసుకెళ్లాలని, గుత్తిలో నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని ప్రతి గ్రామంలోనూ ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే సరైన సమాచారం లేక ఆ రోజున ప్రజలు వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వస్తారని పలువురు చెబుతున్నారు.

స్టేషన్ పాయింట్ల నమోదులో ఇష్టారాజ్యం

- ఎక్కువ పాయింట్లు నమోదు చేసుకున్న 84 మంది ఎస్జీటీలు
- అధికారుల పరిశీలనలో వెలుగులోకి..



దీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా స్టేషన్ పాయింట్లు (పని చేస్తున్న స్కూల్) గరిష్టంగా 24కు మించి ఉండకూడదు. ఎనిమిదేళ్ల సర్వీసుకు (3వ కేటగిరీ) 24 పాయింట్లు వస్తాయి. ఆపైన 9-10 ఏళ్ల సీనియారిటీ ఉన్నా..గరిష్టంగా ఎనిమిదేళ్లకే పాయింట్లు పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది. అయినా కొందరు టీచర్లు ఇష్టానుసారంగా నమోదు చేసుకున్నారు. సరి చేయాల్సిన మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా వందలాది మంది టీచర్లు ఇష్టానుసారంగా స్టేషన్ పాయింట్లు నమోదు చేసుకున్నారు. ఎస్జీటీ తెలుగులో 3,872 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా...వీరిలో 84 మంది ఎస్జీటీలు స్టేషన్ పాయింట్లు 24కు పైగా వేసుకున్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎడిట్ చేయాలని డీఎస్ఈ నుంచి డీఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలు వచ్చాయి.

పట్టించుకోని ఎంఈఓలు

ఎంఈఓల లాగిన్లకు వచ్చిన దరఖాస్తులను..సంబంధిత టీచర్లతో హార్డ్‌కాపీలు తెప్పించుకుని వారు వేసుకున్న పాయింట్లను పరిశీలించి ఆమోదం తెలపాలి. చాలా మండలాల్లో ఎంఈఓలు పట్టించుకోని కారణంగా ఈ ప్రక్రియ సరిగా జరగలేదు. కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు కంప్యూటర్ల ముందు కూర్చుని వచ్చిన దరఖాస్తులను వచ్చినట్లుగానే నిర్ధారించారు. తర్వాత డీఈఓ లాగిన్‌కు వచ్చిన దరఖాస్తులను కూడా కార్యాలయ సిబ్బంది అలానే నిర్ధారించి పంపారు. ఫలితంగానే వందలాది మంది టీచర్లకు స్టేషన్ పాయింట్లలో తేడా వచ్చింది. వీటిని సరిదిద్దుతున్నామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

'ప్రత్యేక' పాయింట్లలోనూ అడ్డదారులు

కొందరు టీచర్లు అనుకూలమైన స్థానాలకు వచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. పుట్టుకతో వచ్చిన శారీరక వైకల్యాలు, వ్యాధుల బారిన పడిన వారు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఉన్నా, ప్రత్యేక పాయింట్లు పొందినా ఎవరికీ అభ్యంతరం ఉండదు. అయితే..లేని రోగాలను సృష్టించుకుని అడ్డదారుల్లో నకిలీ సర్టిఫికెట్లు పొంది పాయింట్లు పొందుతుండడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. డి.హీరేహాళ్ మండలంలో పని చేస్తున్న ఓ ఎస్జీటీ ఇటీవల బైకుపై నుంచి కిందకు పడ్డాడు. ఇదే అదనుగా తనకు మేజర్ సర్జరీ జరిగినట్లు ప్రచారం చేసుకుని నకిలీ సర్టిఫికెట్ తెచ్చుకుని.. ప్రత్యేక పాయింట్లు పొందాలని చూస్తున్నాడు. ఈయన వ్యవహారంపై కొందరు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి వారు పదుల సంఖ్యలో ఉన్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

బదిలీలు, ప్రమోషన్ల కోసం తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లను పున:పరిశీలించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ఎవరైనా మెడికల్ సర్టిఫికెట్లను దుర్వినియోగపరిస్తే.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాణం తీసిన ఓవర్‌టేక్

- కారును ఢీకొన్న కేఎస్ఆర్టీసీ బస్సు
- ఒకరు మృతి.. మరో నలుగురికి గాయాలు



మృతి చెందిన జాన్‌రెడ్డి

ఉరవకొండ/ ఉరవకొండ రూరల్: ఓవర్ టేక్ ఒకరి ప్రాణాన్ని బలిగొంది. కారును కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరానికి చెందిన జాన్‌రెడ్డి (80), చెన్నమ్మ దంపతులు తమ కుమార్తె షైనీ దీప్తి, అల్లుడు రోహన్‌రెడ్డితో కలిసి కర్ణాటకలోని హంపి క్షేత్రాన్ని సందర్శించి శనివారం కారులో తిరుగు పయనమయ్యారు. బూదగవి సమీపంలో బళ్లారి నుంచి ఉరవకొండకు వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారును వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జాన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, కూతురు, అల్లుడుతో పాటు కారు డ్రైవర్ వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రతమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

అడిషనల్ ఎస్పీ సేవలు చిరస్మరణీయం



అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తిని సత్కరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి సేవలు చిరస్మరణీయమని ఎస్పీ జగదీష్ అన్నారు. అడిషనల్ ఎస్పీ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారని అడిషనల్ ఎస్పీని కొనియాడారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ పోలీసు శాఖలో చేరి ప్రజలకు సేవలు అందించడం సంతృప్తి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ షేక్ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు రవిబాబు, వెంకటేశులు, శ్రీనివాస్, మహబూబ్ బాషా, నీలకంఠేశ్వర రెడ్డి (ఏఆర్), గురునాథ్ బాబు, ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, ప్రభాకర్, మహేశ్వర్‌రెడ్డి, ఏఓ రవిరాం నాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

- ఉద్యోగ విరమణ చేసిన పలువురు పోలీసు అధికారులను ఎస్పీ జగదీష్ ఘనంగా సత్కరించారు. రామాంజినేయులు (ఎస్ఐ) జిల్లా స్పెషల్ బ్రాంచి, చంద్రశేఖర్ (ఎస్ఐ) ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, అనంతపురం, శ్రీధర్ బాబు (ఏఎస్ఐ) యాడికి, శివశంకర్ (ఏఎస్ఐ) అనంతపురం టూటౌన్, ఈశ్వర్ (ఏఎస్ఐ) కణేకల్లు, అయూబ్ బాషా, హెడ్‌కానిస్టేబుల్- వన్‌టౌన్ అనంతపురం, వెంకటేశులు కానిస్టేబుల్- ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్, అనంతపురం ఉద్యోగ విరమణ చేశారు. వీరిందరికీ ఎస్పీ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

నాణ్యమైన విత్తనం సిద్ధం చేయండి

- ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య ఆదేశం



వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్

అనంతపురం అగ్రికల్చర్: నిబంధనల మేరకు నాణ్యమైన విత్తనం సిద్ధం చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) జిల్లా మేనేజర్ జి.వెంకటసుబ్బయ్య ఆదేశించారు. శనివారం ఆయన స్థానికంగా ఉన్న హిమబిందు ప్రాసెసింగ్ ప్లాంట్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న విత్తనశుద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. విత్తనశుద్ధి చేసి ఆర్‌ఎస్‌కేలకు సరఫరా చేసిన విత్తనకాయలు బాగలేవని వెనక్కు వస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలని ఆదేశించారు. అవుటన్, తూకాలు కచ్చితంగా ఉండాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 40 శాతం రాయితీతో 1.14 లక్షల క్వింటాళ్ల వరకు వేరుశనగ పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం 15 ప్రాసెసింగ్ ప్లాంట్లలో విత్తనశుద్ధి వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇప్పటికే అనంతపురం జిల్లా వ్యాప్తంగా 16 వేల క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న ఆర్‌ఎస్‌కేలకు 8,500 క్వింటాళ్లు సరఫరా చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయశాఖ సహకారంతో రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయని, త్వరలోనే విత్తన పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సచివాలయ ఉద్యోగుల నిరసనాగ్రహం

- రాజేష్ నాయుడుపై క్రిమినల్ చర్యలకు డిమాండ్



అనంతపురంలో మీడియాతో మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం: మహానాడుకు జన సమీకరణ చేయలేదని వార్డు వెల్ఫేర్ సెక్రటరీ అశ్వత్థరెడ్డిని టీడీపీ 30వ డివిజన్ ఇన్‌చార్జ్ రాజేష్‌నాయుడు పరుష పదజాలంతో దూషించడంపై సచివాలయ ఉద్యోగులు నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. రాజేష్‌నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు బాధితుడితో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సుధాకర్, రామకృష్ణ తదితరులు మీడియాతో మాట్లాడారు. పార్టీ కార్యక్రమానికి జనాలను సమీకరించే బాధ్యత సచివాలయ ఉద్యోగులది కాదన్నారు. బాధితుడు అశ్వత్థరెడ్డికి న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఉద్యోగులను నోటికొచ్చినట్టు తిడుతూ భయభ్రాంతులకు గురిచేస్తే విధులు ఎలా నిర్వర్తిస్తారని ప్రశ్నించారు.

- జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లో సచివాలయ ఉద్యోగులు శనివారం ధర్నా చేసి టీడీపీ నేత రాజేష్‌నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు ఏ పార్టీకి సంబంధించిన వారు కాదన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తామే తప్ప ఏ పార్టీకీ కొమ్ము కాసే ప్రసక్తే లేదని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు స్పష్టం చేశారు.

ఒక్క పథకమైనా అమలు చేశారా?




పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ మంత్రి శైలజానాథ్ తదితరులు

- చంద్రబాబు మోసాలను నిరసిస్తూ ఈ నెల 4న వెన్నుపోటు దినం
- నిరసన ర్యాలీలను విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో ప్రజలను చంద్రబాబు మభ్య పెడుతున్నారన్నారు. హామీలు అమలు చేయకుండా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజలను పీడిస్తున్నారన్నారు. హామీల అమలుపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురావడానికి లక్ష్యంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జూన్ 4న నిర్వహించే ర్యాలీలో పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వెన్నుపోటుకు ఆద్యుడు బాబు

రాజకీయాల్లో వెన్నుపోటుకు ఆద్యుడిగా చంద్రబాబు పేరుగాంచారని మాజీ మంత్రి శైలజానాథ్ విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం చంద్రబాబు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలు త్వరలోనే ఆయనకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. చంద్రబాబు మోసాలకు నిరసనగా నార్పలలో ఈ నెల 4న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్, సత్య నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, నార్పల ఎంపీపీ నాగేశ్వరరావు, రాఘవరెడ్డి, గువ్వల శ్రీకాంత్ రెడ్డి, గోకుల్‌రెడ్డి, చామలూరు రాజగోపాల్, నాగలింగారెడ్డి, ప్రసాద్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



యువకుడి బలవన్మరణం

కణేకల్లు: సంతానం కలగలేదని జీవితంపై విరక్తి చెందిన యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏఎస్ఐ శంకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లంపల్లికి చెందిన గొల్ల వెంకటరాముడు (35)కు బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన మాణిక్యమ్మతో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. సంవత్సరాలు గడిచినా సంతానం కాకపోవడంతో ఆస్పత్రుల్లో చూపించుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఎప్పుడూ పిల్లల గురించే ఆలోచించేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన వెంకటరాముడు శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పొద్దుపోయినా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై అన్ని చోట్లా వెదికినా కనిపించలేదు. శనివారం ఉదయం పక్క పొలంలో చెట్టుకు ఉరికి వేలాడుతున్న వెంకటరాముడును స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

అదనపు కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం అత్తింటివారు పెడుతున్న వేధింపులు భరించలేక వివాహిత తన పుట్టింటిలో బలవన్మరణానికి పాల్పడింది. ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డప్ప వివరాల మేరకు... కడప జిల్లా వేంపల్లి మండలానికి చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ చిన్న నరసింహులుకు ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి(31)తో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెళ్లయిన కొంతకాలం తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు సుబ్బమ్మ, పెద్ద నరసింహులు వేధించడం మొదలు పెట్టారు. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా చేశారు. అయినా మెట్టినింటి వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భాగ్యలక్ష్మి 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. మనోవేదనకు గురైన భాగ్యలక్ష్మి శనివారం ఇంట్లోనే ఉరివేసుకుంది.

రేపటి నుంచి కడప-గుంతకల్లు మధ్య నూతన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల రెండో తేదీ నుంచి కడప - గుంతకల్లు మధ్య ప్రత్యేక రైళ్లను డైలీ ఎక్స్‌ప్రెస్‌గా నడపనున్నట్లు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. కడప రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు (07521) సోమవారం ఉదయం 7.45 గంటలకు బయలుదేరి 11.15 గంటలకు గుంతకల్లు జంక్షన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు యర్రగుంట్ల రైల్వే స్టేషన్‌కు ఉదయం 8.13 గంటలకు, కొండపురం 8.39, తాడిపత్రి 9.13, గుత్తి జంక్షన్ 10.03, గుంతకల్లు జంక్షన్ 11.15 గంటలకు చేరుతుందని తెలిపారు. తిరిగి ఈ రైలు అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు గుంతకల్లు జంక్షన్ నుంచి (07522) బయలుదేరి గుత్తి జంక్షన్ 1.55 గంటలు, తాడిపత్రి 2.40, కొండపురం 3.13, యర్రగుంట్ల 3.43, కడప రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 5.15 గంటలకు చేరుతుందన్నారు.

= విశాఖపట్నం-కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు రోజూ ఉదయం కడప రైల్వేస్టేషన్‌కు 6.30 గంటలకు చేరుతుంది. తిరిగి ఈ రైలు కడప జంక్షన్ నుంచి సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరుతుంది. దాదపు 11 గంటల పాటు కడప రైల్వేస్టేషన్‌లో ఈ రైలును హాల్ట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వృథాగా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కడప-గుంతకల్లు మధ్య నూతన రైళ్లను ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ఏసీ కోచ్‌లను తొలగించి కేవలం స్లీపర్, జనరల్ బోగీలతో ఈ సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించారు. అనంతపురం, కడప జిల్లా ప్రజలకు ఈ రైళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

జిల్లా పరిషత్‌లో బదిలీల జాతర

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగులకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ క్యాంపస్ ఉద్యోగులు, వారి వెంట వచ్చిన వారితో జాతరను తలపించింది. సీఈఓ వెంకటసుబ్బయ్యతో కలసి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 264 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా, 90 మందికి స్థానచలనం కల్పించారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 152 మంది కాగా వారిలో 42 మందిని బదిలీ చేశారు. రిక్వెస్ట్ కింద 113 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా.. 48 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.

యూనియన్ లీడర్ల హల్‌చల్

కౌన్సెలింగ్ జరిగిన సమావేశ భవన్‌లో వివిధ యూనియన్ల నాయకులుగా చెలామణి అవుతున్న హల్‌చల్ చేశారు. తమ యూనియన్ సభ్యత్వం కలిగిన వారికి తామే దగ్గరుండి కోరుకున్న చోటుకు బదిలీ చేయిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. డబ్బులు దండుకునేందుకు ఇలా నాటకాలకు తెరతీశారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, పది, పదిహేనేళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన వారిని మళ్లీ పాత స్థానాల్లోనే కొనసాగించడం దారుణమంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక.. గతంలో జెడ్పీలో పని చేసి అనేక ఆరోపణలు, విమర్శలు మూటగట్టుకున్న వారు ఎనిమిది నెలల కిందట ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అటువంటి వారు పలుకుబడిని ఉపయోగించి తాజాగా మళ్లీ జెడ్పీకి చేరుకోవాలని ఆశించి అన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఎత్తులు పారలేదు.

క్యాడర్ల వారీగా బదిలీలు ఇలా..

క్యాడర్	ఐదేళ్లు పూర్తయిన వారు	బదిలీలు	రిక్వెస్ట్	బదిలీలు
ఎంపీడీఓ	-	-	8	4
ఏఓలు	0	0	13	6
ఎస్ఏలు	10	4	16	3
జేఏలు	6	2	32	15
టైపిస్టులు	3	0	9	3
ఆర్ఏలు	46	12	16	3
ల్యాబ్ అసిస్టెంట్లు	12	9	5	3
లైబ్రరీ అసిస్టెంట్లు	1	1	0	0
అటెండర్లు	74	14	14	11
మొత్తం	152	42	113	48

నలుగురు ఎంపీడీఓలకూ రిక్వెస్ట్ బదిలీలు

తనకల్లు ఎంపీడీఓ ఐ.మమతాదేవిని నార్పలకు బదిలీ చేశారు. ముదిగుబ్బ ఎంపీడీఓ బి.విజయ భాస్కర్‌ను బొమ్మనహాళ్‌కు, కె.ఆజాద్‌ను రామగిరి నుంచి తనకల్లుకు, నార్పల ఎంపీడీఓ ఎస్.గంగావతిని రామగిరికి బదిలీ చేశారు.

ఏడాదిన్నర నిరీక్షణకు తెర

- తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు పునఃప్రారంభం



తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు (ఫైల్)

రాయదుర్గంటౌన్: మరమ్మతులు, అభివృద్ధి పనుల పేరిట దాదాపు ఏడాదిన్నరగా రద్దు చేస్తూ వస్తున్న తిరుపతి - కదిరిదేవరపల్లి రైలుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాయదుర్గం ప్రాంత ప్రజలకు ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ రైలు అందుబాటులోకి రానుంది. రాయదుర్గం - తుంకూరు మార్గంలో ట్రాక్ పనులు పూర్తయిన కదిరిదేవరపల్లి వరకు నడుపుతున్న ఏకైక రైలును సైతం రద్దు చేస్తూ వస్తుండడంతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసేవారు. ఈ రైలు ఇప్పటి దాకా గుంతకల్లు వరకు రాకపోకలకు సాగించేది. 2023 నవంబర్ నుంచి ఈ రైలును రెండు నెలలు, మూడు నెలల పాటు పాక్షికంగా రద్దు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో జూన్ 1న కదిరిదేవరపల్లికి ఈ రైలు (57405) తిరుపతిలో బయల్దేరుతుందని, అలాగే రెండో తేదీన కదిరిదేవరపల్లిలో (57406) రాయదుర్గం మీదుగా తిరుపతికి బయల్దేరుతుందని నైరుతి రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బీఎల్ శివకుమార్ తెలిపారు. రోజూ తిరుపతిలో రాత్రి బయల్దేరి గుంతకల్లు, బళ్లారి మీదుగా రాయదుర్గానికి 11.03 గంటలకు చేరుకుంటుందని, అలాగే కదిరిదేవరపల్లి నుంచి బయల్దేరే ఈ రైలు కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం స్టేషన్‌కు మధ్యాహ్నం 3.49 గంటలకు చేరుకుంటుందన్నారు.

మీ సేవలు అమూల్యం



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులతో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ, శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: ఉద్యోగులుగా ప్రభుత్వానికి, ప్రజలకు మీరు అందించిన సేవలు అమూల్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ చేసి అధికారులు, ఉద్యోగులకు జిల్లా యంత్రాంగం తరపున శనివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగ విరమణ చేసిన వారికి శాలువా కప్పి మొమెంటో, పూల మొక్క అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా


వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల గ్రామంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ గర్భ గుడిలో వేదమంత్రోచ్ఛారణలతో ప్రతిష్ట చేశారు. అనంతరం గ్రామస్తులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో భక్తాంజనేయుడు

అనంతపురం సెంట్రల్: నగరంలో హౌసింగ్ బోర్డులో భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అభిషేకాలు, 5 వేల వడలతో విశేష అలంకరణ, మంగళహారతి ఇచ్చారు. కోలాట ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఆలయ మేనేజర్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోండి



చిన్నారులకు పుస్తకాలు అందజేసిన దృశ్యం

అనంతపురం సెంట్రల్: పిల్లలు ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మై భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవర్ధన శ్రీనివాసులు తెలిపారు. శనివారం సరస్వతి విద్యామందిర్ ఆధ్వర్యంలో బుడ్డప్ప నగర్‌లో షికారి కమ్యూనిటీ పిల్లలకు సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాయిట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ సాయి కుమార్, యువజన జాగృతి వ్యవస్థాపకుడు వెంకటేష్, విద్యామందిరం ప్రిన్సిపాల్ వసుంధర, మైభారత్ సిబ్బంది రూబి, సాయినాథ్, సాయి ట్రస్ట్ బృందం రాఘవేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ పెద్దన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్దన్న (58) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దన్న 2002 నుంచి 2006 వరకు బసంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. విషయం తెలుసుకున్న సానే ఉమారాణి, తదితరులు పెద్దన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు



ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన లారీలు

కనగానపల్లి: మండల పరిధిలోని ముక్తాపురం సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. శనివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి అనంతపురం వైపు రెండు లారీలు వెనుకా, ముందు వెళ్తున్నాయి. ఈ సందర్భంలో ముందు వెళ్తున్న లారీ టైరు ఆకస్మాత్తుగా పంచర్ కావడంతో వెంటనే ఆగిపోయింది. దీంతో వెనుక వైపే వస్తున్న లారీ.. ఆగిపోయిన లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీలు ఒక్కసారిగా రహదారి పక్కన ముళ్లపొదల్లోకి దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం..
బెంబేలెత్తుతున్న జనం



వరిమడుగు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి పంచాయతీలోని వరిమడుగు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుపై విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా తయారైంది. సీసీ రోడ్డు పనులు జరగుతున్నప్పుడు విద్యుత్ స్తంభాన్ని మార్చి.. సీసీ రోడ్డు వేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదు. సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాన్ని మార్చాలని పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు చెబుతున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– రాప్తాడు

తాగునీరు వృథా.. కాలనీవాసుల వ్యథ



వృథాగా బయటకు పోతున్న నీరు



ట్యాంకు నుంచి బయటకు వెళ్లిన నీరు నిలవడంతో మడుగులా మారిన దృశ్యం

నీటి ఎద్దడిని నివారించాలంటే కొళాయిల్లో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు అవగాహన కల్పిస్తుంటే.. అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ ఆటో కాలనీలో నీటి ట్యాంకు నుంచి రోజూ వందలాది లీటర్ల పంచాయతీ నీరు ఇదిగో ఇలా వృథాగా పోతోంది. రోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పంచాయతీ నీరు వదులుతారు. 20 నిముషాల్లోనే అక్కడి ట్యాంకు నిండిపోతుంది. అయినా 2:30 గంటలకు పైగా ట్యాంకు నిండి బయటకు వస్తున్న నీరంతా వృథాగా పోతోంది. ఒకట్రెండు రోజులు కాదు ఏళ్ల తరబడి ఇదేతంతు. రోజూ ఉదయం అటుగా వెళ్తున్న వారు చూడటం తప్పితే కనీసం పంచాయతీ వారికి ఫిర్యాదు చేద్దామని కూడా ఉండదు. కొందరు పంచాయతీ ఉద్యోగులకు ఈ విషయం తెలిసీ కూడా చర్యలు తీసుకోకపోవడం విశేషం.

– రాప్తాడు రూరల్:

రూ.10 కోట్ల స్థలం కబ్జాకు యత్నం

- ఓపెన్ స్పేస్ తమదంటూ ప్రహరీ ఏర్పాటు చేసిన ఘనులు
- ఆలస్యంగా స్పందించిన టౌన్ ప్లానింగ్
- రూ.కోట్ల స్థలానికి వంద రూపాయల ఫ్లెక్సీతో సరిపెట్టిన అధికారులు



రూ.10 కోట్లు విలువ చేసే నగరపాలక సంస్థ స్థలంలో ప్రహరీ ఏర్పాటు చేసిన దృశ్యం



స్థలంలో ఫ్లెక్సీ ఉంచిన అధికారులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థ స్థలాలకు పరిరక్షణ లేకుండా పోయింది. రూ.కోట్లు విలువ చేసే స్థలం తమదంటూ ఇప్పుడిప్పుడు కొందరు బయటకు వచ్చారు. అధికార పార్టీ నేతల అండతోనే నగరంలో ఓపెన్ స్పేస్‌లపై కొందరు కన్ను వేశారు. ఎప్పటికప్పుడు నియంత్రించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. నగరంలోని శారదా నగర్‌లో ఇటీవల నగరపాలక సంస్థ ఓపెన్ స్పేస్‌లో ప్రహరీ ఏర్పాటు చేయడం పెద్ద చర్చనీయాంశమైంది.

రూ.10 కోట్లు స్థలంపై కన్ను

నగరంలోని శారదా నగర్ పార్క్ సమీపంలో నాలుగు లేఅవుట్లకు సంబంధించి పలు సర్వే నంబర్లలో 24 సెంట్లు ఒక బిట్, 26 సెంట్లు మరో బిట్ ఉంది. ఏళ్ల తరబడి ఈ ఓపెన్ స్పేస్ నగరపాలక సంస్థ పరిధిలోనే ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికి ఈ స్థలానికి రెక్కలొచ్చాయి. పలువురు ఈ స్థలం తమదంటూ గుట్టుచప్పుడు కాకుండా ప్రహరీ ఏర్పాటు చేయడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో రూ.కోట్లు విలువ చేసే భూమికి రాత్రి రాత్రికి ప్రహరీ ఏర్పాటు చేయడంపై విస్తుపోయారు. వాస్తవంగా ఇటువంటి నిర్మాణాలు జరిగే సమయంలో పట్టణ ప్రణాళిక కార్యదర్శులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. కానీ పట్టణ ప్రణాళిక కార్యదర్శి ప్రేక్షకపాత్ర పోషించాడు. ఇక టీపీఓ శిరీష, టీపీఎస్ మంజులమ్మ ఆలస్యంగా స్పందించారు. రూ.10 కోట్ల స్థలానికి ఆలస్యంగా వంద రూపాయల ఫ్లెక్సీ కట్టి వదిలేశారు. దీన్ని బట్టి నగరపాలక సంస్థ ఆస్తుల పరిరక్షణ పట్ల టౌన్ ప్లానింగ్ అధికారులకు ఏ పాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీషను సాక్షి సంప్రదించగా.. అది ఓపెన్ స్పేస్ అని.. ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: పొగాకుతో వివిధ రకాల ప్రాణాంతక జబ్బులకు గురి కావాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరూ పొగాకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగు తల్లి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పొగాకుతో వినియోగంతో ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, ఓబులు, ఓఓ గిరిజా మనోహర్, డెమో త్యాగరాజు, గంగాధర్, పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కేన్సర్‌కు కారకం

పొగాకు కేన్సర్‌కు కారకమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొగాతో తలెత్తే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ ఆదినటేష్, డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనం కృష్ణయ్య



కృష్ణయ్యను సన్మానిస్తున్న డీఈఓలు, సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: నిబద్ధతకు నిదర్శనం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కృష్ణయ్య అని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు, శ్రీసత్యసాయి డీఈఓ క్రిష్టప్ప అన్నారు. డీఈఓ కార్యాలయంలో పని చేస్తున్న ఏడీ కృష్ణయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ, డీఈఓ, డీవైఈఓలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, చంద్రలీల, శ్రీసత్యసాయి డీఈఓ కార్యాలయ ఏడీ శ్రీనివాసులు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రామసుబ్బారెడ్డి మాట్లాడారు. కృష్ణయ్య 40 ఏళ్లపాటు విద్యాశాఖలో అంకితభావంతో పని చేసి అంచలంచెలుగా ఎదిగారన్నారు. నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. జిల్లాలో ఏడీ హోదాలో ఆరేళ్ల పాటు ఎలాంటి ఆరోపణలు లేకుండా పని చేశారన్నారు. వివాదస్పద నిర్ణయాలు తీసుకోకుండా నిబంధనలకు లోబడే పని చేశారని గుర్తు చేశారు. నేటితరం ఉద్యోగులు ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సన్మానగ్రహీత కృష్ణయ్య మాట్లాడుతూ.. 1985లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, ఏడీ వరకు చేరుకున్నానన్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఉద్యోగులు, ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎల్కేపీలో సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: అనంత ఉపాధ్యాయ కళాసమితి ఆధ్వర్యంలో 'శివ పూజకు చివురించిన సిరి సిరి మువ్వ' పేరిట ఆదివారం సాయంత్రం స్థానిక లలిత కళాపరిషత్తులో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బాలమురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రసిద్ధ సంగీత దర్శకుడు ఇళయరాజ మ్యూజికల్ ఈవెంట్ నిర్వహిస్తున్నామన్నారు. లైవ్ ఆర్కెస్ట్రాతో సాగే విభావరిలో కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

ఫైనాన్స్ ఆఫీసర్‌కు వీడ్కోలు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)లో ఫైనాన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన ఎం.మొహమ్మద్ సిరాజుద్దీన్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య తదితరులు ఎం.మొహమ్మద్ సిరాజుద్దీన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న, వర్సిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్కేయూలో టైం స్కేల్ ఉద్యోగి పి.వెంకటేశులు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత, రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, టైం స్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు సంజీవప్ప, నారాయణ, రమేష్, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

3న కబడ్డీ టోర్నమెంట్

అనంతపురం రూరల్: మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించడంలో భాగంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి వినోద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆద్వర్యంలో 3వ తేదీ నుంచి నగరంలోని ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9885306643 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

బాధితురాలికి న్యాయం చేస్తాం



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌ఓ మలోల

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాముర్రాయి గ్రామంలో శనివారం డీఆర్‌ఓ మలోల పర్యటించారు. గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీదేవి అనే మహిళ.. 2010లో 168–3 సర్వే నంబరులో 3 సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆ స్థలంలోకి పోనివ్వకుండా జగన్నాథం, శివ అనే వ్యక్తులు అడ్డు పడుతూ వస్తున్నారు. దీనిపై బాధితురాలు లక్ష్మీదేవి ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించింది. ఇందులో భాగంగా డీఆర్‌ఓ మలోల, రూరల్ మండల ఆర్ఐ సందీప్‌కృష్ణ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. అర్జీదారురాలు లక్ష్మీదేవిని కలిసి మాట్లాడారు. వీఆర్‌ఓ హనుమంతు, సచివాలయ సర్వేయర్ బాబ్ జాన్ పిలిపించారు. స్థలం గురించి ఆరా తీశారు. లక్ష్మీదేవికి రావాల్సిన స్థలాన్ని గుర్తించాలని డీఆర్‌ఓ సూచించారు. న్యాయం చేస్తామని బాధితురాలికి హామీ ఇచ్చారు.

'భూమి మా మేనల్లుళ్ల పేరు మీదకు మార్చండి'



తహసీల్దార్‌కు పాత పట్టాదారు పాసు పుస్తకం ఇస్తున్న ఈశ్వర్ రెడ్డి దంపతులు

రాప్తాడు: మా పేరు మీద ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో తొలగించి మా మేనల్లుళ్ల పేరు మీదకు మార్చాలని అనంతపురం రూరల్ మండలం చియ్యేడుకు చెందిన పల్లి ఈశ్వర్ రెడ్డి దంపతులు కోరారు. శనివారం తహసీల్దార్ విజయకుమారిని కలసి వినతిపత్రం అందజేశారు. వివరాలు.. మండలంలోని గొల్లపల్లికి చెందిన గొర్ల రామిరెడ్డికి ఒక కుమారుడు గొర్ల నారాయణ రెడ్డి, ఇద్దరు కుమార్తెలు నరసమ్మ, లక్ష్మీదేవి సంతానం. లక్ష్మీదేవిని ఆత్మకూరుకు, నరసమ్మను అనంతపురం రూరల్ మండలంలోని పల్లి ఈశ్వర్ రెడ్డి ఇచ్చి వివాహం చేశారు. పల్లి ఈశ్వర్ రెడ్డికి మరూరు గ్రామ పొలంలో గొల్లపల్లి గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 80–1లో 6–23 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిని 2008లో తనకు బిడ్డను ఇచ్చిన గొర్ల రామిరెడ్డికి అమ్మివేశారు. ఆ భూమిని గొర్ల రామిరెడ్డి కుమారుడు గొర్ల నారాయణ రెడ్డి పట్టాదారు పాసుపుస్తకంలోకి ఎక్కించుకున్నాడు. పాసు పుస్తకంలోకి ఎక్కించుకున్న భూమి ఆన్‌లైన్ కాలేదు. ఆ భూమి ఇంత వరకు పల్లి ఈశ్వర్ రెడ్డి పేరుపై ఉంది. ఐదేళ్ల కాల వ్యవధిలోనే అనారోగ్యంతో గొర్ల రామిరెడ్డి, అతని కుమారుడు గొర్ల నారాయణ రెడ్డి, అతని కొడలు లక్ష్మీ నరసమ్మ మృతి చెందారు. తాత, తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో నారాయణ రెడ్డి, లక్ష్మీనరసమ్మకు జన్మించిన ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు అనాథలయ్యారు. వీరి బాధ్యతలను మేనత్త అమిన నరసమ్మ, మేనమామ పల్లి ఈశ్వర్ రెడ్డిలే భూజన వేసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న దాడులు, హత్యలు చూశాకా పల్లి ఈశ్వర్ రెడ్డి, ఆయన భార్య నరసమ్మ శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తన పేరు మీద ఉన్న భూమిని మేనల్లుళ్ల పేర్ల మీద మార్చాలని తహసీల్దార్ విజయకుమారిని కోరారు. స్పందించిన తహసీల్దార్.. భూమిని మీ అల్లుళ్ల పేర్లపై ఆన్‌లైన్‌లోకి ఎక్కించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు.

కేశమ్మ సేవలు ఎనలేనివి



కేశమ్మను సన్మానిస్తున్న భూగర్భజల, జలగణన శాఖ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: మానవత్వానికి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన కేశమ్మ సేవలు ఎనలేనివి అని భూగర్భజల, జలగణన శాఖ అధికారులు కొనియాడారు. ఆ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న ఎం.కేశమ్మ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ జయరామిరెడ్డి, ఏహెచ్‌ఓ మంజునాథ్ మాట్లాడుతూ.. కేశమ్మ సేవలను కొనియాడారు. అనంతరం ఆమెకు జ్ఞాపిక అందజేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీఏహెచ్ జ్ఞాపిక, గాయత్రి, మధుసూదన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనే పీటర్ సేవలు ఆదర్శం



హెడ్‌నర్స్ అనే పీటర్‌ను సన్మానిస్తున్న గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి

అనంతపురం మెడికల్: హెడ్‌నర్సు అనే పీటర్ సేవలు మరువలేనివి. ఆమె శేష జీవితం సంతోషంగా సాగాలని గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో హెడ్‌నర్సు అనే పీటర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమెను నర్సింగ్ సూపరింటెండెంట్ సన్మానించారు. స్టాఫ్‌నర్సు, హెడ్‌నర్సుగా ఆమె విశిష్ట సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సుల అసోసియేషన్ ఆర్‌బీ పద్మ, భానులత, లత, నారాయణస్వామి, హెడ్‌నర్సులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. సంగమేష్ నగర్‌లోని జేవీవీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ ప్రచారానికి సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అనే నినాదాలతో గత 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో మమేకమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్, నగర నాయకులు రామిరెడ్డి, తిరుపాల్, ప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి



అన్నదానం చేస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురాం, తదితరులు

అనంతపురం కల్చరల్: ప్రభుత్వ సర్వజనాసుపత్రి వద్ద శనివారం సూపర్ స్టార్ కృష్ణ 82వ జయంతి వేడుకలు కృష్ణ, మహేష్ బాబు అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణ సేన నాయకుడు కేఆర్ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో మాజీ మేయర్ రాగే పరుశురాం కేక్ కట్ చేశారు. అనంతరం రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాగే పరుశురాం మాట్లాడుతూ.. నటులు కృష్ణ, మహేష్ బాబును స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొని అభిమానాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఆలమూరి శ్రీనివాస రెడ్డి, కృష్ణ సేన నాయకులు రవిరాజ్, శేఖర్ బాబు, ఆటో రఫీ, వాటర్ శ్రీను, వెంకటేశ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

అనంతపురం కల్చరల్: స్థానిక కమలానగర్‌లలోని వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ జయంతి నిర్వహించారు. కృష్ణసేన నాయకులు శ్రీనివాసరెడ్డి, రవిరాజ్, సికిందర్ తదితరులు వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణసేన నాయకులు శీనా, నాగరాజు, రాజు , అరవిందరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు. నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమంలో డాక్టర్ నిర్మల మురళీ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు సుశీల, భాగ్యలక్ష్మి, కృష్ణ, లక్ష్మీనారాయణ, మణిదీప్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న యోగా గురువు సురేష్ ఈశాపతి, చిత్రంలో కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో కమిషనర్ ఆదేశాలతో అధికారులు, ఉద్యోగులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. జీవితంలో యోగా భాగం కావాలన్నారు. సురేష్ యోగాలయ్ వ్యవస్థాపకుడు, యోగా గురువు సురేష్ ఈశాపతి మాట్లాడుతూ.. రోజూ గంట పాటు యోగా చేయడం ద్వారా సంతోషకరమైన జీవితానికి బాటలు వేసుకోవచ్చని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ పావని, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ నరసింహ, టీపీఎస్ మంజులమ్మ పాల్గొన్నారు.